## నేడు కార్తీక పౌర్ణమి


కార్తీక పౌర్ణమి సందర్భంగా దీపాలంకరణ

కూసుమంచి, నవంబర్ 26: కూసుమంచిలోని పురాతన కాకతీయుల నాటి శివాలయంలోని కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులకు ప్రత్యేక పూజా కార్యక్రమాలతోపాటు అభిషేకాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వచ్చే భక్తుల కోసం మండపంపై శివలింగాలతో అభిషేకాన్ని నిర్వహించనున్నారు. భక్తుల కోసం ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. స్వామివారిని ప్రత్యేక అలంకరణ చేశారు.

## పువ్వాడ గెలుపును ఆకాంక్షిస్తూ సైకిల్ యాత్ర



సైకిల్ యాత్ర ద్వారా ప్రచారం చేస్తున్న కృష్ణ

ఖమ్మం, నవంబర్ 26: ఖమ్మం నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్ కుమార్ గెలుపును ఆకాంక్షిస్తూ అజయ్‌కుమార్ అభిమాని కుక్కల కృష్ణ సైకిల్ యాత్ర చేస్తున్నారు. ఖమ్మం పట్టణంలోని 60 డివిజన్లు తిరుగుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఖమ్మం జిల్లాకు చేసిన అభివృద్ధిని, అనేక రకాలైన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఎన్నికల్లో పువ్వాడ అజయ్‌కుమార్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేస్తూ ముందుకు సాగుతున్నారు. ఈ యాత్రలో ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తున్నదని ఆయన తెలిపారు.

## పువ్వాడ వాహనాన్ని తనిఖీ చేసిన అధికారులు

ఖమ్మం, నవంబర్ 26: ఖమ్మం బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వాహనాన్ని పోలీస్ ఎన్నికల అధికారులు తనిఖీ చేశారు. ఆదివారం ఉదయం రఘునాథపాలెం మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం ముగించుకుని ఖమ్మం వస్తున్న అజయ్‌కుమార్ వాహనాన్ని ఎన్ఎస్‌పీ కెనాల్ వద్ద ఉన్న చెక్ పోస్ట్ నందు వాహనాలను తనిఖీ చేపట్టారు. పోలీస్, ఎన్నికల అధికారులు సిబ్బందికి పువ్వాడ సహకరించి పక్కన నిల్చున్నారు.

## నేషనల్ కరాటే చాంపియన్ షిప్ ప్రారంభం


ప్రారంభ సమావేశంలో మాట్లాడుతున్న అజయ్‌కుమార్

ఖమ్మం, నవంబర్ 26: ఖమ్మం నగరం షాదీఖానలో జరుగనున్న పల్లా జాన్‌రాములు మెమోరియల్ నేషనల్ కరాటే చాంపియన్ షిప్-2023ను మంత్రి, ఖమ్మం బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ ఆదివారం ప్రారంభించారు. కరాటే మాస్టర్ ఎండీ గఫూర్ ఆధ్వర్యంలో చాంపియన్ షిప్‌లో పాల్గొనే క్రీడాకారులకు పువ్వాడ అభినందనలు తెలిపారు. జాన్ రాములు కుమారుడు, పీస్ కమిటీ చైర్మన్ పల్లా రాజశేఖర్ అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు అమరగని వెంకన్న, కరాటే మాస్టర్స్, క్రీడాకారుల తల్లిదండ్రులు ఉన్నారు.

## ఎంపీ నామా వాహనం తనిఖీ

### సిబ్బందికి సహకరించిన నామా నాగేశ్వరరావు

ఖమ్మం, నవంబర్ 26: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఖమ్మం జిల్లాలో పర్యటిస్తున్న బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నేత, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామా నాగేశ్వరరావు వాహనాన్ని ఆదివారం ఎన్నికల సిబ్బంది తనిఖీ చేశారు. ఎన్నికల సిబ్బందికి ఎంపీ నామా నాగేశ్వరరావు పూర్తిగా సహరించారు. ఎన్నికల సిబ్బంది నామా నాగేశ్వరరావు వాహనాన్ని కొణిజర్ల , వైరా, మధిర వద్ద ఆపి పూర్తిగా తనిఖీ చేశారు.

## రషీదున్నీసా బేగం మృతికి సంతాపం

ఖమ్మం, నవంబర్ 26: ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రభుత్వ డ్రైవర్ సంఘం జిల్లా అధ్యక్షుడు హకీమ్ తల్లి రషిదున్నీసా బేగం(90) మృతికి మంత్రి, ఖమ్మం బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ ఆదివారం సంతాపం తెలిపారు. మోమినాన్ బజార్‌లోని ఆమె స్వగృహంలో భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు. అనంతరం హకీమ్‌ను ఓదార్చారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# పాలేరు ప్రగతి బీఆర్ఎస్‌తోనే సాధ్యం

**అనతికాలంలోనే అనేక సంక్షేమ పథకాలు అందించాం..**

**కారుగుర్తుకు ఓటేసి అత్యధిక మెజార్టీ అందించండి**

**ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి**


రోడ్ షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి


రోడ్ షోకు హాజరైన అశేష జనవాహిని

ఖమ్మం రూరల్, నవంబర్ 26: దశాబ్దాలుగా అభివృద్ధికి దూరమైన పాలేరు ప్రగతి బీఆర్ఎస్‌తోనే సాధ్యపడిందని ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని తీర్థాల, పొలిశెట్టిగూడెం, మద్దివారిగూడెం, మంగళగూడెం గ్రామాల్లో ఆయన మాజీ ఎమ్మెల్యే బాణోత్ చంద్రావతితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాలకు వచ్చిన ఎమ్మెల్యేకు స్థానిక ప్రజలు బ్రహ్మరథం పట్టారు. మంగళహారతులు ఇచ్చి పూలవర్షం కురిపించారు. మంగళగూడెంలో గ్రామ పొలిమేరకు వచ్చిన గ్రామప్రజలు గజమాలతో ఘనంగా సత్కరించారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్నర్ మీటింగ్‌లో ప్రజలను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడారు. గతంలో కనీసం తాగునీటికి అల్లాడిన ఈ ప్రాంత ప్రజలకు తాగునీటితో పాటు సాగునీటిని అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సమాజంలోని ప్రతి కుటుంబానికి వారి అర్హతలను బట్టి సంక్షేమ పథకాలు అందజేశామని గుర్తు చేశారు. ఎన్నికలు రాగానే ఎనలేని ప్రేమను కుమ్మరిస్తున్న వలస నాయకుల మాటలకు ప్రజలు మోసపోవద్దవని, మీ ప్రాంత బిడ్డను, ఇన్నాళ్లు మీ కష్టసుఖాల్లో పాలు పంచుకున్న వ్యక్తికి పట్టం గట్టాలని ఆయన కోరారు. పరాయి వాడి చేతిలో పాలేరును పెట్టవద్దని, నిత్యం ప్రజల మధ్యలో ఉండే నాయకుడకి అవకాశం కల్పిస్తే మరింత అభివృద్ధి చేసుకుందామని చెప్పారు. ఈ నెల 30వ తేదీన జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి మంచి ఆధిక్యత ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్, జడ్పీటీసీ యండపల్లి వరప్రసాద్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

**ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి**

**బీఆర్ఎస్‌లో చేరిన పలు కుటుంబాలు**


పార్టీలో చేరిన రాజావుపేట, చెన్నారం, కాచిరాజుగూడెం గ్రామస్తులు

ఖమ్మం రూరల్, నవంబర్ 26: ఈ నెల 30వ తేదీన జరిగే శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో నేలకొండపల్లి మండలం రాజారావుపేట, చెన్నారం గ్రామాలకు చెందిన 100 కుటుంబాలు బీఆర్ఎస్‌లో చేరాయి. రూరల్ మండలం కాచిరాజుగూడెం గ్రామానికి చెందిన మరో 25కుటుంబాలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలను ఓట్లు అడిగే హక్కు కేవలం బీఆర్ఎస్ పార్టీకీ మాత్రమే ఉందన్నారు. కరోన సమయం నుంచి మొదలు కొని నేటి వరకు నిత్యం ప్రజల మధ్యలో ఉన్నానని, భవిష్యత్‌లో సైతం పాలేరు ప్రజలతోనే నా ప్రయాణం సాగుతుందన్నారు. పాలేరు ప్రజలకు, పాలేరు ప్రాంతానికి బీఆర్ఎస్ రక్షణ కవచంగా ఉంటుందన్నారు. మరో నాలుగు రోజుల పాటు అప్రమత్తంగా మెలిగి అఖండ మెజార్టీ అందించే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నేలకొండపల్లి మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య, పలువురు నాయకులు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్‌లో చేరిన టీ పాలెం మండల యువత


పార్టీలో చేరిన ఆయా గ్రామాల యువకులతో ఎమ్మెల్యే కందాళ

ఖమ్మం రూరల్, నవంబర్ 26: పాలేరు నియోజకవర్గం పరిధిలోని తిరుమలయపాలెం మండలం లోని పలు గ్రామాలకు చెందిన ఆయా పార్టీల యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఆదివారం సాయంత్రం మండలంలోని సాయిగణేష్‌నగర్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఎమ్మెల్యే కందాళ సమక్షంలో పార్టీలో చేరారు. తిరుమలయపాలెం మండలం బచ్చోడు, సోలీపురం గ్రామాలకు చెందిన 45 మంది యువకులు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పాలేరు విద్యార్థులు, యువకులకు మంచి భవిష్యత్ ఉండాలనే ఉద్దేశంతో జేఎన్‌టీయూహెచ్, నర్సింగ్, ఫిషరీస్ కళాశాలలు ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. పార్టీలో చేరిన యువకులు బీఆర్ఎస్ ప్రభుత్వం పాలనపై గ్రామాల్లో మరింత అవగాహన కల్పించాలని కోరారు.

# హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సేవలు అభినందనీయం

**పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మధు**


విద్యార్థినికి చెక్ అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

ఖమ్మం ఎడ్యుకేషన్, నవంబర్ 26: మ్యాక్స్ కళాశాలలో మొదటి సంవత్సరం బీ ఫార్మసీ చదువుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వేగినాటి దీపికకు హెల్పింగ్ హ్యాండ్ సంస్థ సభ్యులు రూ.50వేలను ఫీజుగా ఆదివారం పీఆర్‌టీయూ జిల్లా కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మధు మాట్లాడుతూ... చదువుకు పేదరికం అడ్డు కాకూడదని హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆర్థిక సాయం అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ బొంతు సత్యనారాయణ, పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు, కొల్లు రఘు, సిరిపురపు పురుషోత్తంరావు, మద్దినేని ప్రసాద్ రావు, పోటు శ్రీనివాసరావు, జె సుధారాణి, తల్లూరి నిర్మలకుమారి, తాళ్లూరి గోపాలరావు, సుధాకర్‌రావు, డివిన్ చౌదరి, నూతలపాటి చలమ్య, కడివెండి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.